క్లుప్తంగా

దుప్పలవలసలో ప్రథమ చికిత్స కేంద్రం



ప్రథమ చికిత్స కేంద్రంలో సిద్ధంగా ఉంచిన మందులు

ఎచ్చెర్ల: దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఆదివారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రం వద్ద పొన్నాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని తోటపాలేం, కొంగరాం విలేజ్ హెల్త్ క్లినిక్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎటువంటి అస్వస్థతకు గురైన వెంటనే ప్రాథమిక వైద్యం అందించేందుకు కేంద్రంలో మందులను అందుబాటులో ఉంచామని హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు తెలిపారు. పరీక్షలు పూర్తయ్యేంతవరకూ కేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్వీ రమణ

లావేరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ ఐదో తేదీన చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్వీ రమణ కోరారు. ఈ మేరకు లావేరులో ఆదివారం ప్రజాసంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. స్కీం వర్కర్ల 'సంక్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రజా తిరుగుబాటు రావడం ఖాయమన్నారు. సమావేశంలో నాయకులు రామానుజమ్మ, సుజాత, పుణ్యవతి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేద్దాం

జి.సిగడాం: స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా అందరూ పని చేయాలని పార్టీ నాయకులు పేడాడ శ్రీరామమూర్తి, చిత్తిరి మోహన్ అన్నారు. ఆబోతులపేట, ఆనందపురం గ్రామాల్లో ఆదివారం పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు.

ఒకటిన రణస్థలం మండల సమావేశం

రణస్థలం: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని వచ్చే నెల ఒకటో తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.ధనుంజయరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పిన్నింటి రజని అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.


ముమ్మరంగా ఈకేవైసీ



ఆనందపురంలో ఈకేవైసీ చేయిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలో పంటల సాగుకు సంబంధించి రైతుల ఈకేవైసీ ప్రక్రియను వ్యవసాయాధికారులు జోరుగా చేస్తున్నారు. ఆదివారం ఆబోతులపేట, ఆనందపురం గ్రామాల్లోని అర్హులైన రైతుల ఇంటి వద్దకు సిబ్బంది వెళ్లి ఈకేవైసీ చేయించారు. ఆనందపురం అగ్రికల్చర్ అసిస్టెంట్ ముంతా హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

రణస్థలం: జాతీయస్థాయి కరాటే పోటీల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభకనబర్చి పలు పతకాలు సాధించారని పైడిభీమవరం టైగర్ కరాటే అసోసియేషన్ శిక్షకుడు సింక సంతోష్‌కుమార్ ఆదివారం తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన జాతీయస్థాయి ఎంఎస్‌కేవి సౌత్ ఇండియా ఓపెన్ కరాటే కాంపిటీషన్ పోటీల్లో 15 మంది విద్యార్థులకు వివిధ పతకాలు వచ్చాయన్నారు. సింక భవిష్య, ప్రదీప్, ఈశ్వర సాయి, అంజలి, మధుప్రియ, జ్యోతిసాయి ప్రసాద్, హేమంత్, జస్వంత్‌లు బంగారు పతకాలు, సూర్యకు సిల్వర్, వాసవి బ్రాంజ్ మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లు దక్కించుకున్నట్టు చెప్పారు.

మీ విధేయుడిగా నన్ను గెలిపించండి

- వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు
- సంపూర్ణ మద్దతు ఇస్తాం: ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు, చిత్రంలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ తదితరులు

రణస్థలం: మీ అందరికీ విధేయుడిగా ఉంటాను తనను గెలిపించాలని శ్రీకాకుళం స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పోటీ చేస్తున్నానన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎచ్చెర్ల శాసనసభ్యుడు గొర్లె కిరణ్‌కుమార్ సమక్షంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా మీ అందరి మన్ననలతో కలిసి పార్టీ శ్రేయస్సుకై పని చేస్తానని చెప్పారు. జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు తమ అమూల్యమైన ఓటును వేసి గెలిపించి జగనన్నకు గిఫ్ట్‌గా అందించాలని కోరారు. ఎమ్మెల్యే కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని వైఎస్సార్‌సీపీ ఖాతాలో ఉన్న అందరు ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు ఓటు వేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి బలపర్చిన అభ్యర్థిగా తమ నియోజకవర్గం నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. చంద్రబాబు ఓసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇస్తే.. సీఎం జగన్ బీసీలకు సముచిత స్థానం కల్పించడం సంతోషదాయకమన్నారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు, కార్పొరేషన్ డైరెక్టర్లుగా అధికంగా బీసీలకే ఇచ్చారని గుర్తు చేశారు. తాజాగా ఎమ్మెల్సీ స్థానాలను సైతం అధికంగా బీసీలకే ఇచ్చారని చెప్పారు. సీఎం జగన్ ప్రకటించిన ఏ నిర్ణయమైన పార్టీ శ్రేణులు శిరసావహిస్తారన్నారు. వచ్చే నెల 13వ తేదీన జరగనున్న ఎన్నికలో సభ్యులందరూ విధిగా ఓటు వేసేలా తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు టొంపల సీతారాం, మీసాల సీతంనాయుడు, కాయల రమణ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పిన్నింటి సాయికుమార్, రొక్కం బాలకృష్ణ, మీసాల వెంకటరమణ, బల్లాడ జనార్దన్ రెడ్డి, మహంతి పెద రామినాయుడు, దన్నాన రాజినాయుడు, జరుగుళ్ల శంకరరావు, బూరాడ వెంకటరమణ, సనపల నారాయణరావు, మురళీధరబాబా, నర్తు నరేంద్ర యాదవ్, చిల్ల వెంకటరెడ్డి, మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్పొరేషన్ డైరెక్టర్లు ఉన్నారు.

నడకతో ఆరోగ్యవంతమైన సమాజం



నెలవారీ సంచికను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: నడక ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి వాకర్స్‌క్లబ్ సభ్యులు కృషి చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ 102 గవర్నర్ కర్రోతు సత్యం పిలుపునిచ్చారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం స్టార్ వాకర్స్ క్లబ్ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థల వద్ద రూ.5.10 కోట్ల మూలధనం ఉందని, మహాత్మా గాంధీ ఫెలోషిప్‌ల ఆదాయాన్ని సేకరించే దిశగా సభ్యులు కృషి చేయాలని కోరారు. ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 1350 క్లబ్‌లు ఉండగా.. వాటిలో 4.80 లక్షల మంది సభ్యులు ఉన్నారన్నారు. మారుమూల ప్రాంతాల్లో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ, జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలు క్రమం తప్పకుండా జరిపిస్తూ, నడుద్దాం, నడిపిద్దాం, నవశకానికి నాంది పలుకుదాం అంటూ ముందుకు సాగుతున్న స్టార్ వాకర్స్ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ఎంతో అంకితభావంతో పనిచేసి, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు సంపాదించిన శ్రీకాకుళం స్టార్ వాకర్స్ క్లబ్ మిగిలిన వారికి ఆదర్శంగా నిలుస్తారని ప్రశంసించారు. శ్రీకాకుళం లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు హరికా ప్రసాద్ మాట్లాడుతూ.. నడకతో పాటు చక్కని నడవడికను నేర్చుకోవడానికి వాకర్స్ సంస్థలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఆరోగ్య సమాజ నిర్మాణానికి స్టార్ వాకర్స్ క్లబ్స్ కంకణం కట్టుకొని పనిచేస్తున్నాయని క్యాబినెట్ కోశాధికారి కె.వి.రమణమూర్తి, చీఫ్ కో-ఆర్డినేటర్ పీజీ గుప్తాలు అన్నారు. ఈ సందర్భంగా వాకర్స్‌క్లబ్ నెలవారీ సంచికను ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఎస్.సంజీవరావు, వి.నాగభూషణం, గజల్స్ వాసుదేవ్, చిరంజీవిరావు, అంజనీపుత్ర వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు బాలు, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, ఎం.మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఒకరు చేసే రక్తదానం ముగ్గురి ప్రాణాలను కాపాడుతోందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. రక్తదానానికి విద్యార్థులు కూడా ముందుకు రావాలని కోరారు. శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్‌లో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు పర్యవేక్షణలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులే వారి తల్లిదండ్రులు, బంధువులు రక్తదానం చేసే విధంగా అవగాహన కల్పించడం గొప్పవిషయమన్నారు. సుమారు 300 మంది రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. రక్తదానంపై ఇంకా చాలా మందికి అపోహలు ఉన్నాయని, వాటిని విడనాడి రక్తదానం చేసి బ్లడ్‌బ్యాంకులో రక్త నిల్వలు పెంపునకు సహకరించాలన్నారు. రక్తదాతలకు ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, గాంధీ స్మారక మందిరం సభ్యులు ఎం.వి.ఎస్.ఎన్.శాస్త్రి, నిక్కు అప్పన్న, స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్, విద్యార్థుల తల్లిదండులు పాల్గొన్నారు.

నేడు కూడా రక్తదాన శిబిరం

ఆదివారం జరిగిన శిబిరానికి కొనసాగింపుగా సోమవారం కూడా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది సకాలంలో చేరుకోలేకపోవడంతో లక్ష్యం మేరకు రక్త సేకరణ జరగలేదన్నారు. ఆసక్తి ఉన్నవారు రక్తదానం చేయాలన్నారు.


రహదారిపై తిరుగుతున్న ఆవులు పట్టివేత



సుదర్శన థియేటర్ జంక్షన్‌లో ఆవును పట్టుకుంటున్న దృశ్యం

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని పలు రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతున్న ఆవుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. రహదారిపై ఆవులు సంచరిస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై నిత్యం ఫిర్యాదులు వస్తుండడంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి కూన వినోద్‌కుమార్ టెక్కలి వీధుల్లో సంచరిస్తున్న 7 ఆవులను ఆదివారం పట్టుకొని పంచాయతీ కార్యాలయంలో బంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆవుల యజమానులకు అనేకసార్లు హెచ్చరించినా, ఎటువంటి స్పందన లేకపోవడంతో ఆవులను పట్టుకోవడం జరిగిందన్నారు. అపరాధ రుసుము చెల్లించి ఆవులను తీసుకెళ్లాలని, లేదంటే గోశాలకు తరలిస్తామని పేర్కొన్నారు.

వంద మందికి వైద్య పరీక్షలు



తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యులు

సరుబుజ్జిలి: ఆరోగ్య సూత్రాలు పాటిస్తే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు అరికట్టవచ్చునని కిల్లి వెంకటనర్సింగరావు, శశికళమ్మ సేవా సంస్థ అధ్యక్షుడు కిల్లి హరికృష్ణ అన్నారు. హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రి (విశాఖ) ఆధ్వర్యంలో పురుషోత్తపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కేన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. క్యాన్సర్ లక్షణాలు కనిపించిన వెంటనే తగిన చికిత్సలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ సందర్భంగా సుమారు 100 మందికి తనిఖీలు చేసి మందులు అందించారు. అవసరమైన వారికి ఆస్పత్రికి రిఫర్ చేశారు. వైద్యులు తమ్మినేని మోహన్‌రావు, బగాన కార్తికేశ్వరరావు, స్థానిక యువత శ్రీరామచంద్ర, శ్రీమన్నారాయణ, దాలినాయుడు, పురుషోత్తమరావు, రాజేంద్ర, ఆస్పత్రి అసిస్టెంట్ మార్కెట్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

పోలాకి: స్థానిక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మహదేవన్ (52) శని వారం రాత్రి శ్రీకాకుళంలోని ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. ఎఫ్‌ఎస్ఎల్ డ్యూటీపై హైదరాబాద్ వెళ్లిన మహదేవన్ అదే రాత్రి శ్రీకాకుళం చేరుకున్నారు. ఆదివారం ఉదయం స్టేషన్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉంది. హెచ్‌సీ మృతి చెందిన విషయం తెలుసుకున్న సీఐ రాము, ఎస్ఐ నర్సింహమూర్తి, సిబ్బంది శ్రీకాకుళం వెళ్లారు. అంత్యక్రియల నిమిత్తం పోలీస్ ఫండ్‌ను కుటుంబ సభ్యులకు అందించారు.

పొన్నాడలో ఎన్నికల ప్రచారం

ఎచ్చెర్ల క్యాంపస్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థిగా టీడీపీ బలపర్చిన చిరంజీవులు తరఫున మాజీమంత్రి కిమిడి కళా వెంకటరావు ఆదివారం పొన్నాడ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు చిరంజీవికి వేయాలని కోరారు. నాయకులు బెండి మల్లేశ్వరరావు, గాలి వెంకటరెడ్డి, పంచిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎం పురం, కుశాలపురం గ్రామాల్లో బీజేపీ ఉత్తరాంధ్రపట్ట భద్రుల అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ మాధవ్ తరఫున ఆ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు సంపతరావు నాగేశ్వరరావు, తమ్మినేని గోవిందరావు, వావిలపల్లి చంద్రరావు ఉన్నారు.


అజ్ఞానాన్ని విడితేనే మోక్షం



నర్సింహమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: మనలో ఉన్న అజ్ఞానాన్ని వీడితేనే మోక్షం కలుగుతోందని ప్రముఖవక్త నిష్టల నర్సింహమూర్తి అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో వివేకచూడామణిపై ఆదివారం ఉపన్యసించారు. ఆవరణ, విక్షేపణలే అజ్ఞానం, మాయఅని అన్నారు. ముందుగా వక్తను మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పప్పు పతంజలి శాస్త్రి, ఎస్.నారాయణమూర్తి, జి.విశ్వేశ్వరరావు, సరస్వతి, పి.వి.ఎస్.ప్రసాద్, బాబూరావు, ప్రకాశరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

'ఆ రాతలు సరికాదు'



ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాజకీయంగా చంద్రబాబుకి అండగా ఉండేందుకు రామోజీరావు ఈనాడు పత్రికలో రాసే రాతలు సరికాదని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి స్వరూప్ అన్నారు. అవినీతి రాజకీయ నాయకుడి కోసం పత్రికా విలువలను దిగజార్చుకోవడం తగదన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్ కూడలిలో ఈనాడు ప్రతులను వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ఆదివారం దహనం చేశారు. కార్యక్రమంలో జేఎం శ్రీనివాస్, భైరి మురళి, కర్నేన హరి, సీపాన రామారావు పాల్గొన్నారు.

దైవ చింతన అవసరం

సారవకోట: ప్రజల్లో దైవ చింతర పెరగాలని లైదాం శివానంద ఆశ్రమ పీఠాధిపతి ప్రకాశనంద స్వామి అన్నారు. మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్యజీవన సమాజం ఆధ్వర్యంలో ఆదివారం ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. శివానంద స్వామి పాదుకులకు పూజ చేసి అనంతరం సత్సంగం నిర్వహించారు. భగవద్గీతలో మనం నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అడవ గ్రామానికి చెందిన శివానంద ఆశ్రమ పీఠాధిపతి అరుణకుమార్, గున్నయ్య ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. జాడ మోహనరావు, మెండ సన్యాసిరావు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో సత్తా

పాతపట్నం: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష-2023 (6వ తరగతి ప్రవేశాలకు)లో పాతపట్నంకు చెందిన విద్యార్థి సత్తా చాటాడు. టీచర్స్ కాలనీకి చెందిన ప్రవీణ్ కుమార్ పాణిగ్రాహి 300 మార్కులకు 278 మార్కులు సాధించాడు. సెయింటెన్స్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నారు. తండ్రి రామేచంద్ర పాణిగ్రాహి ఉపాధ్యాయుడు, తల్లి పాతిమా గృహిణి. విద్యార్థికి కుటుంబ సభ్యులు అభినందించారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'



కథ చెబుతున్న విద్యార్థిని



లావేరు: కథలు చదవటం పోటీలో పాల్గొన్న విద్యార్థులతో శ్రీనివాసరావు

ఎచ్చెర్ల: పుస్తకాలు చదవడం ద్వారా మనసు ఆనందంగా ఉంటుందని ధర్మవరం శాఖాగ్రంథాలయ అధికారి ఎం.చంద్రశేఖరరావు అన్నారు. గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరుకు గెడను తింటూ ఉంటే ఆ తీయదనం ఎంత మధురంగా ఉంటుందో పుస్తకాలు చదువుతూ ఉంటే మనసు అంత ఆనందంగా ఉంటుందని పిల్లలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. గొప్ప వాళ్ల జీవిత చరిత్రలను చదువుకుని తమ జీవితాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కథలు చెప్పించడంతో పాటు వేమన శతకం, సుమతీ శతకం, నీతి కథలు ఇతర కథలు, రామాయణం, భారతం వంటివి చదివించారు. కథలు చెప్పడంలో విజేతలుగా నిలిచిన కె.గీతిక, కె.నీరజ, బి.ఉమాదేవిలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాకులు బి.సూర్యనారాయణ, పాఠకులు సూరిబాబు, మహేష్, జగదీష్, సురేష్ పాల్గొన్నారు.

మురపాకలో..

లావేరు: మురపాక గ్రంథాలయంలో కూడా చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్ననాటి నుంచి పుస్తకాలు, వార్తాపత్రికలు పఠనం అలవర్చుకోవాలని సూచించారు. కథలు చదివే పోటీలో విజేతలుగా నిలిచిన స్వాతి, శ్యామల, దేవిలకు బహుమతులు అందజేశారు.

పొగ మంచుతో పాట్లు



కింతలిమిల్లు సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద దట్టంగా కురుస్తున్న మంచుతో కనిపించని వాహనాలు



బైపాస్ సమీపంలో హైవేను కమ్మేసిన పొంగమంచు

ఎచ్చెర్ల క్యాంపస్: గత మూడు రోజులుగా దట్టంగా పొగమంచు పడుతుంది. దీంతో ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. వేకువ జాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు దట్టంగా కురుస్తున్న మంచుతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. జాతీయ రహదారిపై లైట్లు ఉన్న చోట్ల మినహా మిగిలిన చోట వాహనాల రాకపోలను గుర్తించటం సాధ్యం కావటం లేదు. ఎచ్చెర్ల మండలం కుశాలపురం బైపాస్ సమీపంలో వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో దగ్గరకు వచ్చేవరకూ ఇవి కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలకు ఆస్కారం ఉందని స్థానికులు అంటున్నారు. అలాగే జాతీయ రహదారిపై ఎడ్లబళ్లపై ఇసుకను తరలిస్తుంటారు. మంచు కారణంగా ఇవి కూడా కనిపించడం లేదని ద్విచక్ర వాహనదారులు చెబుతున్నారు.

పచ్చదనం అందరి బాధ్యత



మొక్కను నాటుతున్న దృశ్యం

జి.సిగడాం: స్థానిక బీసీ వసతి గృహంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా సత్యసాయి సేవా సంఘం సాయినీడ ప్రోగ్రాం ఇన్‌చార్జి బోయిన చంద్రమౌళి మాట్లాడుతూ.. పచ్చదనం అందరి బాధ్యత అన్నారు. వివిధ రాకాలకు చెందిన 120 మొక్కలను నాటారు. వీటిని సక్రమంగా సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి ఎల్.అప్పారావు, వసతి గృహం వార్డెన్ లోలుగు నూకరాజు, పొందూరు, జి.సిగడాం సత్యసాయి సేవా సమితి కన్వీనర్లు దున్నా రాధాకృష్ణ, నరవ లోకేష్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తూకం వేసి ఇవ్వాలి



గిడ్డంగి వద్ద ధర్నా చేస్తున్న రేషన్ డీలర్లు

నరసన్నపేట: రేషన్ బియ్యాన్ని గిడ్డంగుల వద్దే తూకం వేసి డీలర్లుకు అప్పగించాలని, పాత పద్ధతి ప్రకారం తూకం వేయకుండా ఇస్తే బియ్యం తీసుకువెళ్లేది లేదని డీలర్లు తెలిపారు. స్థానిక సివిల్ సప్లయ్ గిడ్డంగి వద్ద నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన డీలర్లు ఆదివారం ధర్నా చేశారు. ఒక్కో బస్తాలో 50 కేజీల 580 గ్రాముల బియ్యం ఉండాలని డీలర్లు సంఘం అధ్యక్షుడు ఊణ్ణ బాలభాస్కరరావు, ముద్దాడ జగం అన్నారు. బియ్యం తూకం వేయకుండా ఇవ్వడం వల్ల ప్రతీ బస్తాకు మూడు నుంచి ఐదు కేజీల బియ్యం తరుగు వస్తుందని, డీలర్లు నష్టపోతున్నారని ఆందోళన చెందారు. రేషన్ కార్డుల ప్రకారం ఎంత కోటా మంజూరైతే, ఆ మేరకు బియ్యాన్ని ఇవ్వాలని, ఒక్క కేజీ తక్కువ అయినా తీసుకునేది లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్, సివిల్ సప్లయ్ ఉన్నతాధికారులు తూకం వేసి ఇవ్వాలని ఆదేశిస్తున్నా.. గిడ్డంగుల వద్ద అలా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ మేరకు జిల్లా సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ధర్నా చేపట్టామన్నారు. డీలర్లు సంఘం ప్రతినిధులు సూర్యనారాయణ, అప్పన్న, లావణ్య, పంచిరెడ్డి రాజారావు తదితరులు పాల్గొన్నారు. గిడ్డంగి వద్ద డీటీ సైలజను ప్రశ్నించగా తూకం వేసి ఇస్తున్నామని, బస్తాకు 80 గ్రాములు తరుగువస్తుందని అన్నారు.

ఎస్‌జీఎఫ్ ఆపన్న హస్తం



ఆర్థిక సాయమందిస్తున్న ఎస్‌జీఎఫ్ సభ్యులు

కవిటి: మండలంలోని గొనపపుట్టుగ గ్రామానికి చెందిన లండ సంతోష్ కుమార్తె చిన్నారి అన్విక గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. చిన్నారికి ప్రస్తుతం విశాఖపట్నం పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స అందజేస్తున్నారు. శస్త్రచికిత్సకు రూ.5 లక్షల ఖర్చు అవుతుందని డాక్టర్లు పేర్కొన్నారు. దీంతో చిన్నారి వైద్యానికి ఎస్‌జీఎఫ్ సభ్యులు సేకరించిన రూ.42,000 మొత్తాన్ని పినాకిల్ ఆస్పత్రి ఆవరణలో బాధిత కుటుంబానికి ఆదివారం అందించారు. మరింతమంది దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం అందించాలని కోరారు.

ఫ్లైఓవర్ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వంతెన పనులను నాయకులు, అధికారులు ఆదివారం పరిశీలించారు. రైల్వే గేటు నుంచి కాశీబుగ్గ వైపు త్వరితగతిన జరుగుతున్న సిమెంట్ ఫిల్లర్ పనుల వివరాలు తెలుసుకున్నారు. పరిశీలనలో మున్సిపల్ ప్రభుత్వ విప్, 11వ వార్డు కౌన్సిలర్ దుర్గాశంకర్ పండా, ఆర్‌అండ్‌బీ డివిజనల్ ఇంజినీర్ శాశుమాను రామినాయుడు, జూనియర్ ఇంజినీర్ డిక్కల విక్రమ్, లక్కోజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిరిమాను ఉత్సవాలు ప్రారంభం



సిరిమానుకు పసుపు రాస్తున్న మహిళలు

నరసన్నపేట:

సత్యవరంలోని పాదాలమ్మ తల్లి సిరిమాను మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. శాస్త్రోక్తంగా దేవరను తీసుకువచ్చి, సిరిమానుకు పూజలు చేపట్టారు. దేవరకు, సిరిమానుకు మహిళలు ముర్రాటలు సమర్పించారు. ఎంపీపీ ఆరంగి మురళి, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.